# కవితా కౌముది

## దుఃఖమూ ఒక మాటగా..

ఆర్.వి.రాఘవరావు

దాడికి దిగిన దుఃఖం, భయం ఝళిపించిన ప్రతిసారీ
మౌనకవచంతో మొండికిపడటం నేర్చుకున్నాను.
జరిగిన పోరులో
అపజయ రోదనలు అగోచరం
జయధ్వానాలూ అలభ్యం

యాదృచ్ఛికమో, ఏ ఖడ్గ చాలన కారణమో కాని
మౌనకవచం పిగిలి కాసిని మాటలు బయటపడ్డాయి
అలా కొన్ని ఇలా కొన్ని
మరికొన్ని ...మరిన్ని ఇక మరిన్ని మరిన్ని

మాటలు మాటలు మాటలు
నాలోంచి మనలోకి మాటలు,
మననుంచి నాలోకి మాటలు
నాలోంచి మాటలు, నాలోకి మాటలు
జలలా మాటలు, జలపాతంలా మాటలు
మనసుల నుంచి మాటలు, మనుష్యుల్లో కి మాటలు

మాటల చల్లని మేఘస్పర్శతో మైమరచిన నాకు
జయాపజయాల కావల
దుఃఖమూ ఒక మాటలా మిగిలి పోవటం
లీలగా కన్పించింది

★★★



# స్నేహ తీరాల్లో సాహితి

వారు
ఇద్దరూ ఇద్దరే
వారి స్నేహానికి రెండు కళ్లు.

కలసి నడిచారు
మెలిసి మెలిగారు.
తెలిసి బతికారు.

ఓ పగలు
రాత్రితో విభేదించి
ముక్కలైన ఆకాశంలో

మబ్బు తునక తరిమి
మెరుపు ముక్క ఉరిమి
ఒకరిలో ఒకరు మునిగి

చూసుకోలేంత లోతుగా
చేరుకోలేంత దూరంగా
చెరొక వైపు నెట్టివేయపడ్డారు.

ఉధృతంలో..ఉద్రేకంలో
పలుకు పడవ
నడక సడలి...

మరో తీరం
చేరితే
మనో రూపం మారితే

కెరటాలు
కాళ్లతో పొడిచి
అలలకు చెవులు మొలిచి

ఇసుక దుప్పటి
తొలగి
ఒడ్డు ఒడిలో మేల్కొని

స్నేహ తీరాల్లో
తీపి అలల్లో
తిరిగి తేలియాడారు.

★★★



# చలిమంట

శ్రీపతి మారుతి

1.
నిన్న సాయంత్రం ఒక చలిమంట వేసుకున్నానా...
నిప్పురవ్వలన్నీ గూటిలో నుంచి ఎగిరే
పక్షి పిల్లల్లా
ఎగిరెగిరి శూన్యమౌనంలో తలకిందులుగా
పడి మాయమవడం మొదలుపెట్టాయి.

2.
అంతలోనే
ఎక్కడినుండి కొట్టుకొచ్చిందో
ఎంత మంది మనస్సు గాయాలను తాకి వచ్చిందో
పదునెక్కిన పాడుగాలి వెన్నుని కోసింది.

3.
మొన్నటి చలిమంట బూడిదలో
పక్కన పడుకున్న కుక్క దాని
గతజన్మలో
ప్రియురాలి సావాసం గుర్తుకువచ్చిందిమో
సన్నగా అరుస్తూ కలలను కాలంలోకి ఎగబోస్తుంది.

4.
అప్పటిదాకా
వెచ్చగా కప్పుకున్న మంటదుప్పటి
వేడెక్కి విప్పడం మొదలుపెట్టాను.
రాలిపోయిన స్నేహాలు కూడా ఒక్కప్పుడు
వెచ్చగా కప్పుకున్నవేగా అనిపించింది.

5.
వేడికి చల్లదనానికి
మధ్యవస్థ స్థితి
పగలు-రాత్రి
కష్ట-సుఖాలవోలె
చలిమంటలో ఒక జీవితమే
కనిపించింది నాకు.

★★★



## అస్తిత్వం
### సుధాకర్ క్రొవ్విడి

పెదవి అంచున పేరుకున్న నిశ్శబ్దం
అందంగా చెదిరిన వేళ
విరిసే నీ చిరునవ్వు హరివిల్లై
నా మనసు చీకట్లో సంతోషపు కిరణమై విరుస్తుంది

నీ కను కొసలులో చిందిన బాష్పం
నా ఈ చిన్ని ప్రపంచంలో
విషాదపు ఉప్పెనవుతుంది

ప్రతి సౌందర్యాన్నీ నీ కళ్ళతో చూస్తున్నప్పుడు
ప్రతి భావాన్నీ నీ హృదయంతో అనుభూతిస్తున్నప్పుడు
నా ఆవేశాన్నీ నీ ఆలోచన నియంత్రిస్తున్నప్పుడు
రెండు గుండెల చప్పుడేకమయ్యేకా
అప్పుడర్థమయ్యింది
అస్తిత్వాన్ని కోల్పోవడం కూడా ఆనందమేనని

★★★



## నానీలు
### డా.సి.భవానీ దేవి

(1) పెరట్లో గోరింట
అప్పుడే కాదు
ఇప్పటికీ
నా అరచేతిలో మొగ్గే!
(2) సముద్రం చూస్తే
ఎప్పుడూ ఆనందమే
మునిగి పోయిన నేస్తం
గుర్తొస్తేనే!?
(3) నా కళ్ళల్లో
రెండు సముద్రాలు
మా అమ్మనాన్నల
జ్ఞాపకాలు

★★★

## ఒకే ఒక్కడు
### చందలూరి నారాయణరావు

చేతి కి మట్టి చుట్టం
కాలికి మట్టే బంధం
భూమికతడే ప్రాణం
నేలకతడే నేస్తం!
జీవితమంతా ...
తలెత్తిలా చేసిన తలగుడ్డ
మూరెత్తేలా నిలిపిన ముల్లకర్రలే ఆస్థిపాస్తులు
మూగ జీవాలే తోడు-నీడ
గుప్పెడు మట్టి గంపెడు సంతోషం!
కష్టంతో కాయాన్ని పిండి
స్వేదంలో సంతోషం దేవి
లోకాన్ని మోస్తున్న ఒకే ఒక్కడు!
ప్రపంచానా ఆకలి ఉన్నంతవరకు
కర్మ జీవి...శ్రమ జీవి... చిరంజీవి!!

★★★

# నాన్న నానీలు

మాధవరావు కోరుప్రోలు

నీ బతుకు పుస్తకంలో
ఓ పేజీ అనుకున్నావా..
నాన్నంటే..
గొప్ప గ్రంధాలయం.!

మూలాలు తెలియకే.
ఆవేశం నీది.
నాన్నది కోపం కాదు.
వెర్రి ప్రేమ.

నాన్న మాట్లాడడు
మాటలు రాక కాదు.
ఇష్టం లేకా కాదు.
నిలువెత్తు మౌనం.!

ఆది అంతం
లేనివాడని చెప్పలేను..
నిజానికి
నాన్న అనంతుడు కదా.!

కష్టాల పాలు
సేవిస్తుంటాడు ఇష్టంగా.
నీకు మనసా
ప్రేమపాలు పట్టిస్తూ.!

అమ్మకు తెలియదు.
నాన్న తనకు..
అమ్మా నాన్నే కాదు.
స్నేహితుడౌతాడని.!

నాన్న పడడు
వెనకెపుడూ పడలేడు.
ఉంటాడు వెనుకే.
వెనుదన్నుగా.

నిజమే నాన్నా.!
ఎప్పుడూ మరి పిసినారే.
మీ నాన్న.
దాచి..పెడతాడు..నీకే.!

తలవంచడు నాన్న.
బిడ్డ భవిష్యత్తుకే..
తాకట్టు పెడతాడు.
తనతల.!



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కావలయు చింత యెరుగని జీవితమ్ము
వలయునానందమయమైన బ్రతుకు బాట
ఏది యానంద ధార, సంతృప్తి యేది
అందుకొనుటెట్లు మధురానుభూతి

చిరమునెల్లర ప్రేమించు చిత్తవృత్తి
మత్సరమ్మన్న తెలియని మానసమ్ము
చింత సుంతయు లేని హృదంతరమ్ము
ఇట్టులే ప్రతి ఘడియ జీవించనెంతు

ప్రతిదినమ్ము జీవించుటే పరమమతము
సంతతానందమే ప్రతి శ్వాస మనకు
గుండె చప్పుడె సంగీతగోష్ఠి మనకు
బ్రతుకు ప్ పయనమ్మె ప్రత్యక్ష పరమపదము

ఇంత చక్కని వరమిచ్చెనెవరు మనకు
నిత్యమిది మన తోడనే నిలచి యుండు
ఎంత హృదయంగమమ్మిది యెంత ప్రియము
సృష్టికర్తకు తిరిగి యేమీయగలము

ఇచ్చునది జీవితమును ప్రేమించుటొకటె
పూర్ణముగనీ వరార్హత పొందుటొకటె
నిశ్చలానందమున మది నిల్పుటొకటె
పలువురకునీ యమృతసిద్ధి పంచుటొకటె

COMMENTS